# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 08-05-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తామని బీజేపీ సీనియర్ నాయకులు నరేంద్ర మోదీ పేర్కొన్నారు.
- ❖ ఆంధ్రప్రదేశ్ పాలిసెట్ -2024 పరీక్షా ఫలితాలు ఈరోజు విడుదలయ్యాయి.
- ❖ పోలింగ్ ప్రక్రియకు 48 గంటల ముందుగానే సైలెంట్ పిరియడ్ అమల్లోకి వస్తుందని విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జున వెల్లడించారు.
- ❖ విపత్కర పరిస్థితులలో స్వచ్ఛందంగా సేవలందించడానికి ప్రతిఒక్కరూ ముందుకు రావాలని డాక్టర్ విశ్వామిత్ర కోరారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులు అన్నీ పూర్తి చేస్తామని భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. ఈరోజు అన్నమయ్య జిల్లా రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో కలికిరిలో నిర్వహించిన ఎన్నికల బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జల్‌జీవన్ మిషన్ ద్వారా ప్రతీ ఇంటికీ తాగునీరు అందిస్తామన్నారు. పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తామన్నారు. అనంతరం సాయంత్రం 7 గంటలకు విజయవాడలో నిర్వహించనున్న రోడ్ షోలో మోదీ పాల్గొంటారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రప్రదేశ్ పాలిసెట్ -2024 పరీక్షా ఫలితాలు ఈరోజు విడుదలయ్యాయి. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నాగరాణి ఈరోజు ఫలితాలను విడుదల చేశారు. పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహించే

పాలిసెట్ పరీక్ష ఏప్రిల్ 27న  జరిగింది. ఈ పరీక్షకు మొత్తం 1.42 లక్షల మంది అభ్యర్థులు హాజరు కాగా, 1.24లక్షల మంది అర్హత సాధించారు. మొత్తం 87.61 శాతం విద్యార్దులు ఉత్తీర్ణత సాధించగా, అందులో బాలికలు 89.81 శాతం, బాలురు 86.16 శాతం ఉత్తీర్ణత సాధించారని సాంకేతిక విద్యాశాఖ ప్రకటించింది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలు మొత్తం 267 ఉండగా, వాటిల్లో మొత్తం 82 వేల 870 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపింది. పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్, కౌన్సెలింగ్ తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నాగరాణి వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విశాఖను కార్యనిర్వాహక రాజధానిగా చేస్తామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పునరుద్ఘాటించారు. విశాఖపట్నం జిల్లాలోని గాజువాకలో నిన్న నిర్వహించిన ఎన్నికల బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈ సభలో ప్రసంగిస్తూ... జూన్ 4న ఎన్నికల్లో గెలిచాక విశాఖలోనే ప్రమాణ స్వీకారం చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి వైఎస్సార్ సీపీ కట్టుబడి ఉందని జగన్ మోహన్ రెడ్డి పేర్కొన్నారు.  కాగా ఈరోజు ఎన్నికల ప్రచారానికి ఆయన విరామం ఇచ్చారు. రేపు అనంతపురం జిల్లాలో నిర్వహించే ఎన్నికల బహిరంగ సభలో జగన్ మోహన రెడ్డి పాల్గొంటారని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఈరోజు  ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం జరుపుకుంటున్నాం. ప్రకృతి వైపరీత్యాలు, విపత్కర పరిస్తితులు ఇతర సంక్షోభాలతో బాధపడుతున్న వారికి రెడ్‌క్రాస్ స్వచ్ఛందంగా సేవలందిస్తుంటుంది. రెడ్‌క్రాస్ స్థాపకులు హెన్రీ డునాంట్ జన్మదినాన్ని స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం మే 8న ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని పాటిస్తారు. ఈ సందర్భంగా అనేక సేవా కార్యక్రమాలు ప్రపంచవ్యాంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఈరోజు అల్లూరి సీతారామరాజు జిల్లా బ్రాంచ్ కార్యాలయంలో రక్త దాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వామిత్ర మాట్లాడుతూ... హెన్రీ డ్యూనాంట్ చేసిన సేవలను ఆమె కొనియడారు. అనేకమైన విపత్కర పరిస్థితులలో స్వచ్ఛందంగా సేవలందించే రెడ్ క్రాస్ సంస్థకు అందరి సహాయ సహకారాలు అందించాలని ఆమె కోరారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాబోయే ఎన్నికల్లో ఎన్డీఏ కూటమే రాష్ట్రంలో విజయం సాధిస్తుందని జనసేన పార్టీ అధ్యక్షులు కె. పవన్ కళ్యాణ్ విశ్వాసం వ్యక్తం చేశారు.  ఈరోజు ఎన్నికల ప్రచారంలో భాగంగా కృష్ణా జిల్లా గన్నవరం హనుమాన్ జంక్షన్ వద్ద నిర్వహించిన “వారాహి విజయభేరి”లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాష్ట్రంలో ప్రజలు ప్రశాంతమైన పరిపాలన కోరుకుంటున్నారని, అభివృద్ధిని ఆకాంక్షిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. గన్నవరం ప్రాంతాన్ని అన్ని విదాలుగా అభివృద్ధి చేస్తామని పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో రిటర్నింగ్ అధికారులు (ఆర్వోలు) అప్రమత్తంగా ఉండాలని..  విశాఖ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆదేశించారు. ఈరోజు స్థానిక కలెక్టరేట్ లో ఎన్నికల సన్నద్ధతపై జిల్లాలో నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో సమావేశమయ్యారు. పోలింగ్ మెటీరియల్ పంపిణీ, ఈవీఎంల తరలింపు తదితర అంశాలపై ఆర్వోలకు కలెక్టర్ సూచనలు చేశారు. ఓటర్ స్లిప్పులను నిర్ణీత సమయంలో అందజేయాలని అన్నారు. పోలింగ్ ప్రక్రియకు 48 గంటల ముందుగానే సైలెంట్ పిరియడ్ అమల్లోకి వస్తుందని, ఎలాంటి ప్రచారాలు నిర్వహించకూడదని ఆయన స్పష్టం చేశారు. ఎలక్ట్రానిక్ మీడియా ప్రచారం కూడా సైలెంట్ పరియడ్ లో భాగంగా నిలిచిపోతుందని కలెక్టర్ స్పష్టం చేశారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధికి కార్యాచరణ ప్రకటిస్తామని తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఈరోజు జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.... రాబోయే అయిదేళ్లలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యకూ పరిష్కారం చూపిస్తామనన్నారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేస్తామని, రహదారులన్నింటినీ రెండేళ్లలో పునర్నిర్మిస్తామని చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో ఈ నెల 13న లోక్ సభ, అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పోలింగ్ కు 48 గంటల ముందు 11వ తేదీ సాయంత్రం 7 గంటల నుంచి 13వ తేదీ సాయంత్రం 7 గంటల వరకు మద్యం విక్రయాలపై నిషేధం విధిస్తున్నట్లు విజయనగరం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. జూన్ 4వ తేదీన కూడా కౌంటింగ్ సందర్భంగా మద్యం దుకాణాలను మూసి ఉంచాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

తిరుమలలో ఈ నెల 22వ తేదీన నృసింహ జయంతి జరుగనుందని తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు తెలియజేశారు. ఈ సందర్భంగా యోగ నరసింహస్వామివారి మూలమూర్తికి అర్చకులు ప్రత్యేక అభిషేకం చేస్తారని వివరించారు. కాగా నిన్న తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు 4 కంపార్టుమెంట్లలో వేచియున్నారు. టోకెన్లు లేని భక్తులకు 8 గంటల్లో సర్వదర్శనం కలుగుతుందని తెలిపారు. అలాగే స్వామివారిని 65 వేల 146 మంది భక్తులు దర్శించుకున్నారని టీటీడీ అధికారులు వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జిల్లాలో నిన్నటివరకు పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ 61 శాతంగా నమోదయినట్లు కృష్ణా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బాలాజీ తెలియజేశారు. మచిలీపట్నం చిలకలపూడి పాండురంగ హై స్కూల్ లో నిన్నటి వరకు డిస్ట్రిక్ట్ ఫెసిలిటేషన్ సెంటర్ లో రాష్ట్రంలోని అన్ని నియోజక వర్గాల ఓటర్లు పాల్గొన్నారన్నారు. జిల్లాలో 10 పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు చేయగా, ఇందులో కృష్ణా జిల్లా మినహాయించి ఇతర జిల్లా నియోజకవర్గాల్లో ఓటర్లుగా ఉన్న మొత్తం 2 వేల 425 మంది సిబ్బందిలో 1987 మంది పాల్గొన్నారని ఆయన తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రప్రదేశ్ లో రానున్న నాలుగు రోజులు వర్షాలు కురిసే అవకాశముందని భారత వాతావరణ శాఖ తెలిపింది. తూర్పు విదర్భ నుంచి ఉత్తర తమిళనాడు వరకు ఉపరితల ద్రోణి విస్తరించి ఉందని దీని ప్రభావంతో రాబోయే నాలుగు రోజుల్లో రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. కొన్ని చోట్ల భారీ వర్షాలు, మరికొన్ని ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. రాయలసీమ కోస్తాంధ్రలో మెరుపులు, ఉరుములతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని, గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని ఆ శాఖ తెలియజేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జంతువులను రక్షించడాన్ని ప్రతీ ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. భీమవరంలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో మూగజీవాల కోసం 30 నీటి బిందెలను కలెక్టరు చేతుల మీదుగా ప్రకృతి ప్రేమికులకు అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ, మూగ జంతువుల కోసం ఈ వేసవిలో ప్రధాన కూడళ్లలో నీటి కుండలను ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. మానవులుగా మనమే వేడిని భరించలేకపోతున్నామని, జంతువులను రక్షించడం మనందరి బాధ్యత అని ఆయన గుర్తు చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఎన్నికల ప్రక్రియలో సూక్ష్మ పరిశీలకుల (మైక్రో అబ్జర్వర్ల) పాత్ర చాలా కీలకమని, విశాఖ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ. మ ల్లికార్జున, సాధారణ పరిశీలకులు అమిత్ శర్మ పేర్కొన్నారు. నగరంలోని స్థానిక ఉడా చిల్డ్రన్ ఎరీనాలో జరిగిన ఒక్క రోజు శిక్షణ సదస్సులో మైక్రో అబ్జర్వర్లను ఉద్దేశించి వారిద్దరూ ప్రసంగిస్తూ, పలు అంశాలపై మార్గనిర్దేశం చేశారు. పోలింగ్ ముందు రోజు, పోలింగ్ రోజున చాలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అక్కడ పరిస్థితులను గమనించి నివేదించాలని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియలో ప్రత్యక్షంగా పాల్గొనడానికి వీలులేదని ఈ సందర్భంగా సాధారణ పరిశీలకులు అమిత్ శర్మ స్పష్టం చేశారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు తప్పకుండా పాటించాలని, ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అంశాలను నివేదించేందుకు మాత్రమే మొబైల్ ఫోన్ వినియోగించాలని అమిత్ శర్మ సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =